ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 4 డిసెంబరు 2024

వరద బాధితులకు ఆర్థిక సాయం

- విల్లుపురం, కడలూరు, కళ్లకుర్చి జిల్లావాసులకు తలా రూ.2వేలు
- సీఎం ప్రకటన



వరద నష్టంపై మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జల దిగ్బంధానికి గురైన విల్లుపురం, కడలూరు, కళ్లకుర్చి జిల్లాల్లో రేషన్ కార్డుదారులకు తలా రూ.2వేలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. నవంబర్ 30వ తేదీ నుంచి ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా కడలూర్, కళ్లకుర్చి, విల్లుపురం, కృష్ణగిరి, ధర్మపురి, తిరువన్నామలై జిల్లాల్లో 40 నుంచి 50 సెం.మీ.లకు పైగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలకు వేలాది ఏకరాల్లో వరి పంట నీట మునిగింది. మరోవైపు వరదలు, ఈదురు గాలులకు రహదారులు, వంతెనలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం చెంగల్పట్టు, విల్లుపురం జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం తరఫున చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించారు. ప్రజలు, అధికారుల వద్ద నష్టం వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, కొందరు మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాలకు మంగళవారం వెళ్లి సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం విల్లుపురం, కళ్లకుర్చి, తిరువన్నామలై, కడలూర్, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో వరద బాధితులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు...

తుపాను, వరదల వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు తలా రూ. 5లక్షలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న గుడిసెలకు తలా రూ.10వేలు నష్టపరిహారం, వరదల్లో కొట్టుకుపోయిన గుడిసెలకు కలైంజర్ స్మారక గృహ పథకంలో ఇళ్లు కట్టుకునేందుకు రాయితీ, నీట మునిగిన పంటలకు హెక్టార్‌కు రూ.17వేలు, మొక్కజొన్న, మినప, కంది పంటలకు రూ.8,500 నుంచి రూ.22,500 వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. వరదల్లో పాడిపశువులను కోల్పోయిన రైతులకు రూ.33,500, గొర్రెలకు రూ.4,000, మృతి చెందిన కోళ్లకు తలా రూ.100 చొప్పున సాయం ప్రకటించింది. అతి భారీ వర్షాల కారణంగా జన జీవనం స్తంభించిన విల్లుపురం, కడలూర్, కళ్లకుర్చి జిల్లాల్లో రేషన్ కార్డుదారులకు తలా 2వేలు ఆర్థిక సాయం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

తడిసిన ధ్రువ పత్రాలు..

వరద ప్రాంతాల్లో విద్యా, కులధ్రువ పత్రాలు, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఇంటి పట్టా, భూములకు సంబంధించిన పత్రాలు కోల్పోయిన వారికి ప్రత్యేక శిబిరాల ద్వారా కొత్త ధ్రువ పత్రాలు, అలాగే విద్యార్థులకు కొత్త పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. సహాయాల పంపిణీకి సంబంధించి ధర్మపురి, కృష్ణగిరి, తిరువన్నామలై జిల్లాల కలెక్టర్లు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు.

విల్లుపురం, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో
కొనసాగుతున్న వరద

- దీవులుగా మారిన గ్రామాలు
- స్తంభించిన రాకపోకలు



కృష్ణగిరి జిల్లా ఊత్తంగరైలో నీటి మునిగిన ఇళ్లు

చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలతో పాటు, ప్రధాన జలాశయాల నుండి విడుదలైన అదనపు జలాల కారణంగా విల్లుపురం, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో వరద కొనసాగుతూనే వుంది. ఈ నాలుగు జిల్లాల్లో సుమారు రెండు వేలకు పైగా కుగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి దీవులుగా మారిన ఆ గ్రామాలలో ప్రజలు ఆహారం కోసం, ఆదుకునేవారి కోసం ఎదురు చూస్తున్నారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా పుదుచ్చేరి రాష్ట్రం, విల్లుపురం జిల్లాల్లో 50 సెంటీమీటర్లకు పైగా కుండపోతగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిన విషయం తెలిసిందే. భారీ వర్షాల కారణంగా విల్లుపురం కలెక్టర్ ఆఫీసు, కొత్త బస్‌స్టేషన్ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. తుపాను తీరం దాటిన తర్వాత విల్లుపురం జిల్లావాసులు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఆదివారం అర్ధరాత్రి సాత్తనూరు డ్యామ్ నుంచి ఒకేసారి 1.80లక్షల ఘనపుడుగుల అదనపు జలాలను విడుదల చేయడంతో ఆ జిల్లాలో ముప్పావు శాతం గ్రామాలు నీట మునిగాయి. విల్లుపురం పక్కనే ఉన్న కడలూరు జిల్లాలో పుదుచ్చేరి రాష్ట్రంలోనూ జలాశయాలు, చెరువులు పొంగి ప్రవహించడంతో జనవాస ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆకస్మిక వరదల కారణంగా కడలూరు తిరువెన్నై నల్లూరు, తిరుకోవిలూరు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. కడలూరు జిల్లాలో 115 గ్రామాలు, విల్లుపురం జిల్లాల్లో 240 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. విల్లుపురం జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షాలు, వరదల కారణంగా 11 మంది మృతిచెందారు. తమను ఆదుకునేందుకు అధికారులు ఎవరూ రాకపోడంతో గ్రామాలవారు ఆగ్రహం చెందిన మంగళవారం అరసూరు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. దీనితో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అగరం చిత్తామూరు గ్రామంలో వరదల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదేవిధంగా కారపట్టు, ఆలంకులం, తిరుముండీశ్వరం సహా 50 గ్రామాలు ఇంకా వరదనీటిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో పదికి పైగా కార్లు, బైకులు వరద నీటి ప్రవహంలో కొట్టుకుపోయాయి.

కడలూరులో జలవిలయం...

ఓ వైపు ఫెంగల్ తుఫాన్, మరో వైపు తెన్‌పెన్నైయారు వరదల కారణంగా కడలూరు జిల్లాలో సుమారు 30 వేలకు పైగా ఇళ్లల్లో వరదనీరు చొరబడింది. పల్లపు ప్రాంతాల్లో చిక్కుకున్న 25 వేలమందిని ప్రభుత్వ ప్రత్యేక శిబిరాలకు తరలించారు. సోమవారం వేకువజాము నుంచి తెన్‌పెన్నైయారు వరదల కారణంగా పన్రుట్టి, కడలూరు తాళంగూడా వరకూ జనావాస ప్రాంతాలన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. కడలూరు పెరియకంగనాం కుప్పం, గుండు ఉప్పలవాడి, తాళంకూడా తదితర ప్రాంతాల్లోని చెరువులన్నీ ఊళ్లపై పొంగి ప్రవహిస్తున్నాయి. మంత్రి ఎంఆర్కే పన్నీర్ సెల్వం, జిల్లా అధికారులు కలిసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రత్యేక శిబిరాల్లో బస కల్పిస్తున్నారు. ఈ జిల్లా వరద పరిస్థితుల నుండి పూర్తిగా కోలుకోవటం వారం రోజులు పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



విల్లుపురంలో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు - వరదనీరు రావడంతో ధ్వంసమైన ఇల్లు

కృష్ణగిరి, ధర్మపురిలో...

ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా ఇప్పటి వరకూ 20 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సుమారు 3 వేల హెక్టార్ల విస్తీర్ణం కలిగిన పొల్లాలోని పంటలు నీటిలో మునిగాయి. కృష్ణగిరి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా 50 సెం.మీల చొప్పున వర్షం కురవటంతో ఊత్తంగరై, పరిసర ప్రాంతాల్లో చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఊత్తంగరై బస్టాండు, తిరుపత్తూరు రహదారి తదితర ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడ్డాయి.

నేటినుంచి తిరువణ్ణామలైలో
కార్తీక దీపోత్సవాలు

- 13న మహాదీపం

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ కార్తీక మహాదీప వేడుకలు జరుగనున్నాయి. కార్తీక మహాదీపోత్సవాలు బుధవారం ఉదయం 4 గంటలకు ధ్వజారోహణతో ప్రారంభించనున్నారు. 5వ తేదీ సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖర్, రాత్రిపై ఇంద్రవాహనంలో పంచమూర్తులు ఊరేగుతారు. ఆరో తేదీ ఉదయం, నాగవాహనం, రాత్రి సింహ వాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఏడో తేదీ ఉదయం నాగవాహనం, రాత్రి కల్పవృక్ష వాహనంలోను, 8వ తేదీ ఉదయం వృషభ వాహనం, రాత్రి పెద్ద శేషవాహనం. తొమ్మిదో తేదీన వెండి గజ వాహనం, రాత్రి వెండి రథోత్సవం జరుగుతుంది. 10 న మహారథోత్సవం నాలుగు మాడ వీధుల్లో నిర్వహిస్తారు. 11 న అశ్వవాహనంపై ఊరేగుతారు. 13 వేకువజామున భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు తిరువణ్ణామలై పర్వతశిఖరంపై మహాదీపాన్ని వెలిగిస్తారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. అలాగే, ఈ వేడుకలకు వచ్చే భక్తుల కోసం రవాణా శాఖ ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంది. ముఖ్యంగా కార్తీక దీపం రోజున వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపనుంది.

18న డీఎంకే కార్యవర్గ సమావేశం

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కార్యవర్గ సమావేశం ఈ నెల 18న జరుగనుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరుగనున్న ఈ కార్యవర్గ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సభ్యులందరికీ లేఖలు కూడా రాశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు.

'ఫెంగల్' నష్టంపై
ప్రధాని మోదీ ఆరా

- సీఎం స్టాలిన్‌కు ఫోన్

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో అపారనష్టం వాటిల్లింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. తుఫాను బాధిత జిల్లాల్లో జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎంకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదిలావుంటే, ప్రధాని మోదీ ఫోన్ చేసిన విషయంపై ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ట్వీట్ చేశారు. ఫెంగల్ తుఫాన్ సృష్టించిన నష్టంపై ప్రధాని మోదీ ఫోన్ చేసారని చెప్పారు. ఈ సందర్భంగా తుఫాను ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించినట్టు తెలిపారు. అంతేకాకుండా, ప్రకృతి వైపరీత్యం వలన కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని తక్షణం రాష్ట్రానికి పంపించాలని, వరద బాధితులను ఆదుకునేందుకు తక్షణ సాయం అందజేయాలని ప్రధానిని కోరినట్టు తెలిపారు. తుఫాను ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలైన సహాయ సహకారాలు అందిస్తుందని భావిస్తున్నట్టు సీఎం స్టాలిన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మంత్రి పొన్ముడిపై బురద

- సాయం అందలేదన్న కోపంతో చల్లిన జనం



మంత్రి చొక్కాపై ఉన్న బురద

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా ఇరువేల్పట్టు ప్రాంతంలో తగిన సాయం అందలేదన్న కోపంతో బాధితులు రాష్ట్ర మంత్రిపైనే బురదచల్లడం ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా వున్నాయి... ఫెంగల్ తుఫాను ప్రభావంతో విల్లుపురం జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే. దిండివనం సమీపం మయిల్ ప్రాంతంలో అత్యధికంగా 51 సెం.మీ వర్షపాతం నమోదుకావడం, సమీపంలోని చెరువు గట్టు తెగడంతో దిండివనం కూడా జలమయమైంది. వరద బాధిత ప్రాంతాల్లో సైనికులు సహాయక చర్యలు చేపట్టి, బాధితులను విల్లుపురం పునరావాస శిబిరాలకు తరలించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం వరద బాధిత ప్రాంతాలు పరిశీలించి బాధితులకు సహాయాలందించేందుకు మంత్రి పొన్ముడి, జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు విల్లుపురం చేరుకున్నారు. ఇరువేల్‌పట్టు ప్రాంతంలో ప్రజలు ఆందోళన చేపడుతున్నారని తెలుసుకున్న మంత్రి వారితో మాట్లాడేందుకు వెళ్లారు. అయితే మంత్రి పర్యటనను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకెలాంటి సాయం అందలేదని, శిబిరంలో ఆహారం కూడా అందించడం లేదని నినాదాలు చేపట్టారు. అయితే ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మంత్రిపై బురద చల్లారు. అక్కడున్న పోలీసులు మంత్రి చుట్టూ నిలిచారు. నిరసనకారుల ఆగ్రహాన్ని గ్రహించిన మంత్రి పొన్ముడి.. అక్కడి నుంచి మౌనంగా వెళ్లిపోయారు.

వరద కష్టం ప్రభుత్వ అసమర్థతే

- ఫొటోలకు పోజిస్తూ ప్రజలను నట్టేట ముంచారు
- సాత్తనూరు జలాల విడుదలలో నిర్లక్ష్యం
- ఈపీఎస్, అన్నామలై ధ్వజం



సేలం సమీపం తిరుమణిముత్తారు వద్ద వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈపీఎస్ తదితరులు - మరక్కాణంలో వరద బాధితులను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాల సమయంలోనూ, సాత్తనూరు డ్యామ్ జలాల విడుదలలోనూ డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిని ప్రదర్శించటం వల్లే విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరి ప్రాంతాల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ధ్వజమెత్తారు. సేలం సమీపంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈపీఎస్, విల్లుపురం జిల్లా మరక్కాణంలో అన్నామలై మంగళవారం పర్యటించారు. బాధితులను పరామర్శించి పార్టీల తరఫున సహాయాలను అందజేశారు. విల్లుపురం జిల్లాలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న మరక్కాణం పరిసర ప్రాంతాల్లో వరద ప్రాంతాల్లో అన్నామలై పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి వరద బాధితులను ఆదుకుంటున్నట్లు ఫొటోలకు ఫోజులిస్తూ ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు. ఫెంగల్ తుఫాను వల్ల రాజధాని నగరం చెన్నైకి ముప్పు వాటిల్లి ఉంటే ప్రసారమాధ్యమాలన్నీ పనిగట్టుకుని అదే పనిగా వరద పరిస్థితులపై ప్రత్యక్ష ప్రసారాలను చేసి ఉండేవని, అయితే వర్షబీభత్సానికి గురైన ప్రాంతాలన్నీ గ్రామాలు కావడంతో ప్రసార మాధ్యమాలు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. విల్లుపురం కడలూరు జిల్లాల్లో వరద పరిస్థితులు ఏర్పడానికి సాత్తనూరు డ్యామ్ జలాలను ముందస్తు హెచ్చరిక చేయకుండా విడుదల చేయడమే కారణమని, ఈ వరద ముప్పునకు ప్రభుత్వ యంత్రాగం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరి ప్రాంతాలను నీట ముంచారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ఈ ప్రాంతాల్లో ఫెంగల్ తుఫాన్ బీభత్సం వల్లే వరదలు సంభవించాయని తప్పుడు సమాచారం చెబుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలను మోసపుచ్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రతియేటా కేంద్రం ప్రభుత్వం విపత్తుల నిర్వహణకు భారీగా నిధులు విడుదల చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు, వర్షబాధితులకు ఆ నిధిని తాత్కాలికంగా వినియోగించుకోవచ్చునని సూచించారు. బుధవారం తాను ఢిల్లీ వెళ్ళి ప్రధాని మోదీని కలిసి రాష్ట్రంలో ఏర్పడిన వరద, వర్ష నష్టాలను వివరించి భారీగా నిధులు విడుదల చేసేందుకు విజ్ఞపి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యం...

డీఎంకే ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం వల్లే ఫెంగల్ ప్రభావిత వర్షాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్ ఆరోపించారు. మంగళవారం సేలం సమీపం కందంబట్టి బైరోడ్డు సమీపంలో తిరుమణి ముత్తారు వద్ద వరద ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం వాననీటి కాల్వలను, చెరువులను, జలాశయాలను వర్షాకాలానికి ముందే పూడికతీత చేపట్టకపోవడం వల్లే వరదలు వచ్చాయని చెప్పారు. సాత్తనూరు డ్యామ్ జలాల విడుదలలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని, డ్యామ్‌ను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఒకేసారి నీటిని విడుదల చేసి ప్రజలకు వరద ముప్పు కలిగించిందని ఆరోపించారు.



అన్నా అరివాలయంలో దివ్యాంగుల దినం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న దివ్యాంగులు

చెన్నై విమానంలో
సాంకేతికలోపం

- 162 మందికి తప్పిన ముప్పు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కువైట్ నుంచి చెన్నై బయలుదేరి విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ విషయాన్ని పైలెట్లు చివరి నిమిషంలో గుర్తించడంతో 154 మంది ప్రయాణికుల సహా 162 మంది ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఎయిర్ ఇండియా విమానం సోమవారం రాత్రి 11.26 గంటలకు కువైట్ నుంచి చెన్నైకి 154 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో విమానం బయలుదేరింది. అయితే, టేకాఫ్ అయిన తర్వాత విమానంలో సాంకేతిలోపాన్ని పైలెట్లు గుర్తించి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించి తిరిగి ల్యాండింగ్ చేశారు. దీంతో ఆ విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు.



కడలూరు జిల్లా మేల్‌పట్రంబాక్కంలో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి

సమాచార దృష్టి

వైమానిక దళంలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైమానిక దళంలో ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వైమానిక దళాధికారి, గ్రౌండ్, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, అకౌంట్స్ సహా వివిధ ఖాళీ పోస్టులు భర్తీచేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తు సమర్పణ, మరిన్ని వివరాలకు careeraiforce.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

12న 'జీఈఎం'పై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం)పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగల్‌లోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 12వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ జరుగనుంది. ఈ శిక్షణలో జీఈఎం పరిచయం, సాధారణ సేకరణ ప్రక్రియ, విక్రేతలకు జీఈఎం ప్రయోజనాలు, జీఈ ఎం ఆన్-బోర్డింగ్ విధానం, జీఈఎం బిడ్డింగ్ విధానం తదితరాలను వివరించనున్నారు. ఈ శిక్షణలో 18 ఏళ్లకు పైబడిన వారు పాల్గొనవచ్చు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9080609808, 9877152265, 9841693060అనేనెంబర్లు సంప్రదించవచ్చు.

నేటినుంచి 2,665 మంది పోలీసులకు శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక బోర్డు పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 2,665 సెకండరీ గ్రేడ్ పోస్టులను ఇటీవల భర్తీ చేసింది. కొత్తగా ఎంపికైన వారికి 7నెలల ప్రాథమిక శిక్షణ, నెల ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఆ ప్రకారం, తిరువళ్లూర్‌లో 300 మంది, వేలూరులో200, విల్లుపురంలో 292, మదురైలో 389, తూత్తుకుడిలో 512, తిరుచ్చిలో 350, కోయంబత్తూర్‌లో 200 మందికి బుధవారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. కాగా, ఎంపికైన 2,665 మందిలో 792 మంది మహిళలున్నారు.

21 నుంచి పినాంగ్ దీవికి ఇండిగో విమానసేవలు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి పినాంగ్ దీవికి ఈ నెల 21 నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన సేవలు ప్రారంభమవుతున్నాయని పినాంగ్ పర్యాటక శాఖ ప్రధానాధికారి అశ్విన్ గుణశేఖరన్ ప్రకటించారు. మలేసియా ఆధీనంలోని పినాంగ్‌కు పలు దేశాల నుంచి విమానాలు నడుపుతున్నారు. ఆ దీవిలో తమిళులు అధికంగా ఉన్నప్పటికీ భారత దేశం నుండి ఆ దీవికి డైరెక్టు విమానాలు లేవు. ఆ కొరత తీర్చేలా ఇండిగో ఎయిర్ లైన్స్ పినాంగ్‌కు ఈ నెల 21 నుంచి డైరెక్టు విమాన సేవలను ప్రారంభించనుంది.

విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ ప్రారంభమై 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయమై వాతావరణ శాఖ దక్షిణ మండల డైరెక్టర్ ఎస్.బాలచంద్రన్ విడుదల చేసిన ప్రకటనలో... భారత వాతావరణ శాఖ 150వ వార్షికోత్సవాలు 2025 జనవరి 15వ తేది ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా భారత వాతావరణ కేంద్రం కార్యకలాపాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో 8,9, ప్లస్ టూ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://mausam.imd.gov.in/metoly/ అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 10వ తేది రాత్రి 11.59 గంటల్లోపు పేర్లు నమోదుచేసుకోవాలి. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించి 17న ఫలితాలు ప్రకటించనున్నారు. రాష్ట్రస్థాయి విజేతలు జనవరి 14న నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హులు. 15వ తేది బహుమతులు అందించనున్నారు. ఇతర వివరాలకు 9498002635, 044-2824 6034 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

స్కూళ్లలో వర్షపునీరుంటే హెచ్ఎంలే సెలవు ప్రకటించొచ్చు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాఠశాలల్లో వర్షపునీరు ప్రవహించినా, తరగతి గదుల్లో తేమ ఉన్నా, పరిసరాలు బురదగా ఉన్నా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిస్థితులను పరిశీలించి సెలవు ప్రకటించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలన్నారు.

విల్లుపురంలో స్కూళ్లు, కాలేజీలకు నేడు సెలవు

చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరద పరిస్థితులు కొనసాగుతుండటంతో విల్లుపురం జిల్లాలో బుధవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలకు, తెన్‌పెన్నైయారు వరదలకు జిల్లాలోని పలు ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయని, పాఠశాలలు, కళాశాలల చుట్టూ వర్షపునీరు వరదలా ప్రవహిస్తున్నాయని జిల్లా కలెక్టర్ పళని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనపు టోకెన్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శుభ ముహూర్తం రోజున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నారు. శుభముహూర్తాల సమయంలో ప్రజలు స్థలాలు కొనుగోళ్లు, విక్రయాలు చేపడుతుంటారు. ఈ కారణంగా, కార్తీక మాసం శుభ ముహూర్తమైన ఈ నెల 5వ తేది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నారు.

తుపాను చరిత్రలో కొత్తది...!

● 500 కి.మీ నిధానంగా దాటిన 'ఫెంగల్'



పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తుపాను చరిత్ర 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రూ.500 కి.మీ దూరాన్ని మెల్లగా కదిలిన తుపానుగా 'ఫెంగల్' నిలిచింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను చెన్నై, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం మార్గాల్లో కదిలింది. అనంతరం దిశ మార్చుకొని పశ్చిమ దిశగా పయనించి తిరువణ్ణామలై, కృష్ణగిరి, సేలం తదితర జిల్లాల మీదుగా సాగింది. ఫెంగల్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం వర్షాలు తగ్గినా, జనజీవనం ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదు. ఈ నేపథ్యంలో, ఫెంగల్ తుపానుకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. 50 ఏళ్లగా రాష్ట్ర తుఫాన్‌ల చరిత్రలో ఇంత నిదానంగా కదులుతూ తుఫాన్ తీరం దాటలేదని వాతావరణ పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ విషయమై వాతావరణ కేంద్రం మాజీ అధికారి ఒకరు మాట్లాడుతూ... సాధారణంగా తుపానులు ఎప్పుడూ 220 కి.మీ నుంచి 300 కి.మీ వరకు 10 నుంచి 12 కి.మీ వేగంతో పయనిస్తుంటాయి. కానీ, ఫెంగల్ తుఫాన్ 3 కి.మీ వేగంతో మాత్రమే పయనించింది. అలా 500 కి.మీ వెళ్లేందుకు ఐదు రోజులు తీసుకుంది. తుపానుగా మారిన మూడు రోజుల్లో బలపడుతుంది. కానీ నవంబరు 25వ తేది బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నాలుగు రోజుల అనంతరం అంటే 29వ తేది తుపానుగా మారింది. గత 50 ఏళ్ల రాష్ట్ర తుఫాను చరిత్రలో ఓ తుపాను ఇలా మెల్లగా కదిలిన సందర్భాలు లేవు. సహజంగా తుపాను తీరం దాటిన తర్వాత బలహీనపడుతుంది. కానీ, 9 గంటలు ఒకే ప్రాంతంలో ఉంటూ, సముద్రంలో తేమను బాగా గ్రహించి ఆ తర్వాత మెల్లగా తీరం దాటడం ప్రారంభించింది. పలు జిల్లాల్లో అతి భారీవర్షాలు కురవడానికి ఇది కారణం. వాతావరణ సమాచారాన్ని సరైన రీతిలో అంచనా వేసే వ్యవస్థ మన వద్ద లేదని అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. తొలుత, అరేబియా సముద్రం వైపు ఫెంగల్ తుఫాన్ కదులుతున్న నేపథ్యంలో, తిరుపత్తూర్ నుంచి తేని వరకు 15 జిల్లాలకు భారత వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడం కొసమెరుపు.

ఆ విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సేవచేయాలి

● షరతుతో బెయిలిచ్చిన హైకోర్టు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి హత్యకేసులో అరెస్టయిన నలుగురు విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో రోగులకు సేవ చేయాలనే నిబంధనతో మద్రాసు హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. రాజధాని కళాశాలలో చదువుతున్న తిరుత్తణికి చెందిన సుందర్ అనే విద్యార్థిని అక్టోబర్ 4న సెంట్రల్ రైల్వేస్టేషన్ వద్ద పచ్చయప్పా కళాశాలకు చెందిన విద్యార్థులు వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. ఈ సంఘటనకు సంబంధించి పచ్చయప్పా కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో చంద్రూ, ఈశ్వర్, ఈశ్వరన్, యువరాజ్ అనే నలుగురు విద్యార్థులు హైకోర్టులో బెయిలు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఏటీ జగదీష్ చంద్రా ఉత్తమపౌరులుగా రాణించాల్సిన విద్యార్థులు ఇలా హంతకులుగా మారటం గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా నగరంలో గత పదేళ్లలో విద్యార్థులపై నమోదైన కేసుల వివరాలతో పోలీసుశాఖ నుంచి ప్రత్యేక నివేదిక తెప్పించుకుని పరిశీలించారు. ఆ తర్వాత ఈ బెయిలు పిటిషన్‌ను సమగ్రంగా పరిశీలించిన న్యాయమూర్తి నలుగురు విద్యార్థుల్లో ఇద్దరు కీల్పాక్ వైద్యకళాశాల ఆస్పత్రిలో, మరో ఇద్దరు విద్యార్థులు రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర చికిత్సా విభాగంలో 15 రోజులపాటు రోగులకు సేవలందించాలన్న నిబంధనతో బెయిలు మంజూరు చేశారు. తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు ఈ నలుగురు విద్యార్థులు తమకు కేటాయించిన ఆస్పత్రుల్లో రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవ చేయాలని, వీరికి ఎమర్జెన్సీ విభాగానికి సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు అప్పగించి, ఆయా విభాగాలకు చెందిన వైద్యశాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని ఉత్తర్వు జారీ చేశారు. ఈ బెయిలు పిటిషన్‌పై తదుపరి విచారణను 20వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజు పచ్చయప్పా కళాశాల, రాజధాని కళాశాల ప్రిన్సిపాళ్లు విచారణకు హాజరుకావాలంటూ న్యాయమూర్తి ఏటీ జగదీష్ చంద్రా ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తర చెన్నైలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి పనులు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైలో రూ.6,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. పెరంబూర్ బస్టాండ్ సమీపంలోని నెల్‌వాయల్ రోడ్డు, హార్బర్ నియోజకవర్గంలోని శాఖా గ్రంథాలయాలను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తొలుత ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.6వేల కోట్లతో పనులు చేపట్టనున్నామన్నారు. ఉత్తర చెన్నై పరిధిలోని 15కు పైగా శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు, గ్రంథాలయాలకు కొత్త భవనాల నిర్మించే కార్యక్రమాన్ని త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు.

ప్లాట్‌ఫామ్ వ్యాపారులకు 31వరకు గుర్తింపు కార్డులు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో రహదారి బాటలో దుకాణాలు నడిపే వ్యాపారులకు చెన్నై మహానగర కార్పొరేషన్ అధికారులు గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు. కార్డులు ఇచ్చేందుకు ఈ నెల 31 వరకు ప్రత్యేక శిబిరాన్ని కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో సుమారు 35 వేల మంది ప్లాట్‌ఫామ్ వ్యాపారులకు క్యూఆర్‌కోడ్ తో ఉన్న గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ఇప్పటికే 5186 మంది వ్యాపారులకు పంపిణీ చేశారు. ఫెంగాల్ తుఫాను కారణంగా కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను తాత్కలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం పరిస్థితి చక్కబడడంతో నగరంలో ఈ నెల 31 వరకూ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఈ కార్డుల జారీని పూర్తి చేయాలని సంకల్పించారు. ప్లాట్‌పామ్ దుకాణాల వ్యాపారులకు కార్పొరేషన్ ఇచ్చిన తాత్కాలిక గుర్తింపు కార్డు, ఆధార్ కార్డుతో శిబిరాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత వారికి క్యూఆర్‌కోడ్ గుర్తింపు కార్డులిస్తామని అధికారులు తెలిపారు.

తుఫాన్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

● సీపీఎం నేత బాలకృష్ణన్

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫెంగల్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రజలకు, రైతులకు తగిన నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాలకృష్ణన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తుఫాను బాధిత ప్రాంతాల్లో జరిగిన నష్టాలను కనుగొనేందుకు అధికారుల బృందాలను పంపాలని, వీలైనంత త్వరగా అంచనాలను రూపొందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంట నష్టపోయి ఆర్థికంగా చితికిపోయిన రైతులను ఆదుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని బాలకృష్ణన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

విపత్తులకు ప్రకృతి కాదు... మనమే కారణం...!

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని పలు ప్రాంతా ల్లో సంభవిస్తున్న విపత్తులకు ప్రకృతిని తప్పుపట్టలేమని, అందుకు మనమే కారణమని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఊటీ, కొడైకెనాల్ తదితర కొండ ప్రాంతాల్లో వినియోగించి విసిరేస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నిషేధం కేసులో హైకోర్టు న్యాయమూర్తులు ఈ మేరకు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సంబంధించి కేసు విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు సతీష్‌కుమార్, భరత్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం, జాతీయ రహదారుల పక్కన టన్నుల కొద్దీ పడిన ప్లాస్టిక్ తొలగించవచ్చు కదా అని సలహా ఇచ్చారు. ప్రపంచంలో పలు ప్రాంతాల్లో విపత్తులు సంభవిస్తున్నాయని, దానికి ప్రకృతి కారణమని చెప్పలేమన్నారు. అందుకు ప్రధాన కారణం మనమేనన్నారు. హక్కుల గురించి మాట్లాడే ప్రజలు, తాము చేయాల్సిన బాధ్యతలపై మాత్రం ఆందోళన చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ఈ కేసులో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసి, విచారణ వాయిదావేశారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతులు

● మంత్రి సెంథిల్ బాలాజీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన విల్లుపురం జిల్లాల్లో విద్యుత్ మరమ్మతు పనుల్లో 900 మంది సిబ్బంది నిమగ్నమైవున్నారని విద్యుత్ శాఖామంత్రి సెంథిల్ బాలాజీ వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మతు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, విల్లుపురం జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి మరమ్మతులు జరుగుతున్నాయన్నారు.

తుఫాను బాధితులకు టీవీకే సహాయం



ఓ మహిళకు సాయం అందజేస్తున్న టీవీకే నేత విజయ్

చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ మంగళవారం సహాయాలు అందజేశారు. పనయూరులోని పార్టీ కార్యాలయంలో టీపీ సత్రం ప్రాంతానికి చెందిన బాధితులు సుమారు 300 మందికి ధోవతులు, చీరలు, దుప్పట్లు, కిరాణా సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి పెంచాలంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నేతలు

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం పిచ్చానూరులో గంగాధరస్వామి మున్సిపాలిటీ మాధ్యమిక పాఠశాల పనిచేస్తోంది. ఈ పాఠశాల స్థాయి పెంచి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో విద్యా కమిటీ నిర్వాహకులు జయవేలు, పుదియ నీది పార్టీ నగర సెక్రటరీ ఎస్.రమేష్ అన్నాడీఎంకే నగర సెక్రటరీ కేఎన్ పళని, రాష్ట్ర కాంగ్రెస్ చేనేతకారుల శాఖ అధ్యక్షుడు దేవరాజ్, న్యాయవాదులు సంపత్‌కుమార్, కుమార్, త్యాగరాజన్, బీజేపీ నగర అధ్యక్షుడు ఆనందన్, పీఎంకే నగర సెక్రటరీ కుమార్, మాజీ నగర మండ్రం సభ్యుడు పళని సహా పలువురు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో రోడ్లపై ఇసుక మేటలు



ఇసుక మేటలో వాహనచోదకుల ఇక్కట్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగ్ తుఫానుతో సముద్రపు అలలు ఎగసిపడడంతో పళవేర్కాడు సమీపం కరుంగాలి పాత ముఖద్వారం రోడ్డుపై ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పళవేర్కాడు ప్రాంతంలో నివసించే ప్రజలు ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రం, అదానీ హార్బర్, కామరాజర్ హార్బర్లకు ఈ రోడ్డు మార్గంగానే ప్రయాణిస్తుంటారు. తుఫాను కారణంగా 40 కి.మీ వేగంతో వీచిన గాలులతో నీటితో పాటు ఇసుక కూడా రోడ్డుపై చేరింది. దీంతో, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై చేరిన ఇసుక మేటలు తొలగించే పనులను అధికారులు చేపట్టారు.

ప్రపంచంలోనే 'చికెన్ 65'కి మూడో స్థానం



వాషర్‌మెన్ పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ముఖ్యంగా తమిళనాడులో కనిపెట్టిన చికెన్ 65, నేడు ప్రపంచంలో కోడిమాంసం వంటకాల్లో మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ స్థాయిలో ప్రతి ఏడాది ప్రజలు ఇష్టంగా స్వీకరించే ఆహార పదార్థాల వివరాలు సేకరించి, వాటి జాబితాను టెస్ట్ అట్లాస్ అనే సంస్థ విడుదల చేస్తోంది. ఈ జాబితాలో తమిళనాడులో తయారవుతున్న చికెన్ 65 మూడో స్థానంలో నిలిచింది. 1960లో బుఖారీ అనే ఆహార సంస్థ ఈ చికెన్ 65 తయారీ ప్రారంభించినట్లు చెబుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో తయారయ్యే చికెన్ 65 రుచి, నాణ్యత పరిశీలించిన సంస్థ నిర్వాహకులు, మూడో స్థానాన్ని కేటాయించారు. ఈ జాబితాలో చైనాకు చెందిన క్రిస్పీ ఫ్రైడ్ చికెన్, తైవాన్‌కు చెందిన బాంబకాన్ చికెన్ తదితరాలు కూడా చోటుచేసుకున్నాయి.

భారీవర్షాలతో కొండ రైలు సేవలకు అంతరాయం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలతో కొండ రైలు సేవలు రెండో రోజైన మంగళవారం కూడా రద్దయ్యాయి. భారీ వర్షాల కారణంగా ఊటీ-కున్నూర్, కున్నూర్-మేట్టుపాళయం మధ్య రైలు మార్గంపై మట్టిచెరియలు విరిగి పడ్డాయి. దీంతో ముందు జాగ్రత్తగా సోమవారం కొండ రైలు రద్దు చేశారు. రైలుపట్టాలపై పడిన మట్టిచెరియలను రైల్వే కార్మికులు తొలగించారు. బుధవారం నుంచి రైలు సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఒకవేళ వర్షాలు కురిస్తే రద్దు చేస్తే అవకాశముందని అధికారులు తెలిపారు.



ఫెంగల్ తుపాను కారణంగా తిరువణ్ణామలై వావూసీ నగర్‌లోని ఇంటిపై పడిన మట్టిచెరియల తొలగింపును సోమవారం రాత్రి పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

తుఫాన్ వచ్చినా నిండని జలాశయాలు

● వేసవిలో నగరానికి తప్పని నీటిఎద్దడి...?



పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్ ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో, రాజధాని నగరం చెన్నైకి తాగునీరందించే జలాశయాల్లో మొత్తం 50 శాతం మాత్రమే నీటినిల్వలున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశముందని వాటర్ బోర్డు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరవాసులకు నీరందించే పూండి, చోళవరం, పుళల్, చెంబరంబాక్కం, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగ తదితర ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11,757 మిలియన్ ఘనపుటడుగులు. ఈశాన్య రుతుపవనాల సీజన్ అక్టోబరు 15వ తేది ప్రారంభమైన నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కానీ, తాగునీరందించే జలాశయాల పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో, గత వారం 50 శాతం కంటే తక్కువగానే నీటి నిల్వలున్నాయి. 'ఫెంగల్' తుపాను కారణంగా చెంబరంబాక్కం, పుళల్, పూండి జలాశయాలకు మాత్రమే నీరు చేరడంతో ఆ జలాశయాల్లో నీటిమట్టాలు పెరిగాయి.

జలాశయాల పరిస్థితి

ఆదివారం గణాంకాల ప్రకారం, 21.20 అడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో 18.22 అడుగులు, 35 అడుగుల సామర్థ్యం కలిగిన పూండి జలాశయంలో 23.30 అడుగులు, 24 అడుగుల సామర్థ్యం కలిగిన చెంబరంబాక్కంలో 20.07 అడుగుల నీటినిల్వలున్నాయి. తేర్వాయ్‌కండిగై, చోళవరం జలాశయాల పరిధిలో తగినంత వర్షాలు లేకపోవడంతో నీటి రాక తక్కువగా ఉంది. ఈ ఐదు జలాశయాల్లో ప్రస్తుతం 6,336 మిలియన్ ఘనపుటడుగుల నీరు మాత్రమే ఉంది. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం 3,392 మిలియన్ ఘనపుటడుగుల నీరు తక్కువగా ఉంది. ఈశాన్య రుతుపవనాల సీజన్ ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో, రెండు సార్లు వాయుగుండాలు, ఒక సారి తుపాను సంభవించినా, ఈ జలాశయాలకు నీరు చేరకపోవడం గమనార్హం. ఈశాన్య రుతుపవనాలు ముగిసేలోగా ఈ జలాశయాల్లో 80 శాతం నీటి నిల్వలుంటేనే, వచ్చే ఏడాది నగరవాసులకు తాగునీటి కొరత ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

ఆగని లంక నావికాదళం దాడులు

● 18 మంది కారైక్కాల్ జాలర్ల అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కారైక్కాల్ జిల్లా నుంచి చేపల వేటకు వెళ్లిన 18 మంది జాలర్లను లంక నావికాదళం సోమవారం రాత్రి అరెస్ట్ చేసింది. కీళకాసాకుడిమేడు గ్రామానికి చెందిన పాల్‌మణి ఫైబర్ పడవలో కలైమణి, మోహన్‌కుమార్, సుధిన్, మాణిక్యవేల్, ఆకాష్ రామన్, సెల్వనాథన్, శక్తి వేల్ సహా 18 మంది జాలర్లు ఈ నెల 1వ తేది రాత్రి 8 గంటల సమయంలో కారైక్కాల్ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లారు. సోమవారం సాయంత్రం కొడియకరై సమీపంలోని భారత సరిహద్దు ప్రాంతంలో చేపలు పడుతుండగా వారి పడవ మరమ్మతులకు గురైంది. అంతలో అక్కడకు చేరుకున్న శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ 18 మంది జాలర్లను అరెస్ట్ చేసి, నావికాదళం కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో వాయుగుండం, తుపాను కారణంగా వారం రోజులుగా ఇళ్లకే పరిమితమైన జాలర్లు, చేపల వేటకు వెళ్లిన సమయంలో లంక నావికాదళం అరెస్ట్ చేయడంతో జాలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీ నిషేధం



పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా హొగెనేకల్ జలపాతం వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో, దోనెల సవారీ, జలపాతాల వద్ద పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. హొగెనేకల్ జలపాతం వద్ద సోమవారం 5,000 ఘనపుటడుగులున్న నీరు, మంగళవారం ఉదయం 7 గంటలకు 14వేలు, 8 గంటలకు 21వేలు, 9.30 గంటలకు 23వేలు ఘనపుటడుగులకు పెరిగింది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా ఐందరువి, సినీ ఫాల్స్, మెయిన్ ఫాల్స్ సహా ఐదు జలపాతాల్లో స్నానాలకు నిషేధం విధించడంతో పాటు, జలపాతంలో దోనెల సవారీని నిషేధిస్తున్నట్లు, వరద ఉధృతి తగ్గిన తర్వాత స్నానాలు, దోనెల సవారీకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

వరద బాధితులకు ఆహారం



బాధితులకు ఆహారం అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెన్‌పాక్కం ఇందిరానగర్ ప్రాంతం ఇటీవల కురిసిన వర్షాలతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో, రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ ఆ ప్రాంతానికి వెళ్లి 150 మంది ఆహారం అందజేశారు.

పూర్తిస్థాయిలో పల్లికొండ పెద్ద చెరువు



చెరువులో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు నియోజకవర్గంలోని పల్లికొండ పెద్ద చెరువు పూర్తిగా నిండింది. డీఎంకే జిల్లా సెక్రటరీ, స్థానిక ఎమ్మెల్యే నందకుమార్ మంగళవారం చెరువులో పూలుచల్లారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు కేంద్ర యూనియన్ సెక్రటరీ వెంకటేశన్, పంచాయతి మండ్ర సెక్రటరీ జాగీర్ హుస్సేన్, పల్లికొండ పంచాయతి అధ్యక్షుడు సుప్రియ కుమరన్, వార్డు కౌన్సిలర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవాలకు గొడుగుల సమర్పణ



భూమినాధీశ్వరాలయం నుంచి తిరువణ్ణామలైకు ఊరేగింపుగా తీసుకెళ్తున్న గొడుగులు

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ మున్నేట్ర కళగం జిల్లా శాఖ ఆధ్వర్యంలో తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాలకు మూడు గొడుగులు సమర్పించారు. కరుగంపుత్తూర్ గ్రామంలోని మనోన్మణి తాయార్ సమేత భూమినాధీశ్వరాలయం నుంచి మంగళవారం ఈ గొడుగులకు తిరువణ్ణామలైకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో హిందూ మున్నేట్ర కళగం స్థాపక అధ్యక్షుడు గోపినాథ్, డివిజన్ అధ్యక్షుడు శక్తివానన్, బెల్ ద్రావిడ సెల్వన్, గొడుగుల కమిటీ అధ్యక్షుడు నవీన్, సంతోష్, డా.తమిళరసన్, పూండి ప్రభాకరన్, జై శ్రీదేవి సంపత్, మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు.

విల్లుపురం జిల్లాలో అందని సెల్‌ఫోన్ సిగ్నల్స్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లావ్యాప్తంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫెంగల్ తుపాను కారణంగా ఈ జిల్లాల్లో ఈదురుగాలులతో భారీవర్షాలు కురిశాయి. గాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలతో పాటు సెల్ టవర్లు కూడా నేలకూలాయి. దీంతో బీఎస్ఎన్ఎల్ సహా పలు సంస్థల సిగ్నల్స్ స్తంభించాయి. జిల్లాలో వరదల్లో చిక్కుకున్న తమ బంధువులను సెల్ ఫోన్‌లో సంప్రదించేందుకు వీలుకాక, వరద ప్రాంతాల వివరాలు తమ బంధువులకు తెలిపేందుకు వీలు లేకపోవడంతో జిల్లా ప్రజలు అవస్థలు పడుతున్నారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో అదనపు గేట్లు



అదనపు గేట్లు ప్రారంభిస్తున్న అధికారులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో నడుపుతున్న మెట్రోరైళ్లకు ప్రజల ఆదరణ పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు మెట్రోరైళ్లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోంది. ప్రయాణికులు టిక్కెట్లు పొందేలా ఫోన్ పే, క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ తదితర సదుపాయాలను మెట్రో సంస్థ ప్రవేశపెట్టింది. అలాగే, మెట్రో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు సులభంగా వెళ్లేలా గేట్లు పెంచుతున్నారు. ఆ క్రమంలో, ఎగ్మూర్, వాషర్‌మెన్‌పేట మెట్రో రైల్వేస్టేసన్ అదనపు గేట్లకు సోమవారం అధికారులు ప్రారంభించారు.

'మళైయిల్ ననైగిరేన్'

డిఫరెంట్ లవ్ స్టోరీ

● దర్శకుడు సురేష్ కుమార్



'మళైయిల్ ననైగిరేన్'లో అన్సన్‌పాల్, రెబా మోనికా

అన్సన్‌పాల్, రెబా మోనికా జాన్ జంటగా నటించిన 'మళైయిల్ ననైగిరేన్' చిత్రం ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీ అని ఆ చిత్ర దర్శకుడు టి.సురేష్ కుమార్ అన్నారు. రాజశ్రీ వెంచర్స్ పతాకంపై బి.రాజేష్ కుమార్ సమర్పణలో రూపొందింది. ఈ నెల 12న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. దర్శకుడు టి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు ఎన్నో ప్రేమకథా చిత్రాలు వచ్చాయి. కానీ, ఈ చిత్రం వాటన్నింటికి భిన్నంగా ఉంటుంది. ఇందులో హీరోహీరోయిన్లు వర్షంలో కలుసుకుంటారు. వారి ప్రేమకథ కూడా వర్షంలోనే ముగుస్తుంది. హీరోయిన్‌కు ఏమాత్రం ఇష్టంలేకపోయినప్పటికీ హీరో ప్రేమిస్తాడు. ఆ యువతి అంగీకరించదు. తన ప్రేమను అంగీకరించేంత వరకు వేచి చూస్తానని చెబుతాడు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళాల్సిన యువతి హీరో ప్రతిపాదనకు అంగీకరించి ఇక్కడే ఆగిపోతుందా? భిన్నమతాలకు చెందిన వీరిద్దరూ పెద్దలను ఎదిరించి ఒక్కటయ్యారా? లేదా? అన్నదే ఈ క్లైమాక్స్. ప్రేమకథ చిత్రంలో మెలోడీ పాటలు ఉన్నాయి. కుటుంబ సభ్యులంతా కలిసి చూడదగిన సినిమాగా రూపొందించాం' అని అన్నారు. హీరో అన్సన్‌పాల్ మాట్లాడుతూ, 'ఇప్పటివరకు నేను నటించిన పాత్రలకు ఇందులోని పాత్రకు పూర్తిగా భిన్నమైన రోల్. తన ప్రేమను విజయవంతం చేసుకునే యువకుడి పాత్రలో నటించాను' అని పేర్కొన్నారు. హీరోయిన్ మోనికా రెబా మాట్లాడుతూ, 'ఇది ఫీల్‌గుడ్ మూవీ. ఇటీవలి కాలంలో మంచి ప్రేమకథా చిత్రాలు రాలేదు. ఆ లోటును భర్తీ చేసే మంచి మూవీగా నిలుస్తుంది' అన్నారు. నిర్మాత బి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ, 'నేను సూపర్‌స్టార్ రజనీకాంత్ వీరాభిమానిని. ఒక విధంగా చెప్పాలంటే ఆయన నాకు దేవుడితో సమానం. అందుకే సినిమా విడుదలకు ముందే మమ్మలను ఆశీర్వదిస్తూ ఈ చిత్రం విజయం సాధించాలంటూ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. పైగా ఈ చిత్రాన్ని ఈ నెల 12వ తేదీన విడుదల చేయడానికి కూడా ప్రధాన కారణం ఇదే. 2018లో ఈ ప్రాజెక్టును ప్రారంభించాం. అపుడు హీరోగా ఎంపిక చేసిన వ్యక్తి ఇపుడు గొప్ప నటుడు. అతని స్థానంలో అన్సన్‌పాల్‌ను తీసుకున్నాం. 'పుష్ప-2' వంటి భారీ బడ్జెట్ చిత్రం విడుదలవుతున్నప్పటికీ మా కథపై ఉన్న నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేస్తున్నాం' అని వివరించారు.

ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగివుండాలి

● దుషార విజయన్



చిత్రజ్యోతి

సూపర్‌స్టార్‌గా ఎదిగినప్పటికీ.. కాళ్ళు మాత్రం భూమ్మీదే ఉంటాయని, ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండాలన్న విషయాన్ని తన అభిమాన హీరో రజనీకాంత్‌ను చూసి తాను నేర్చుకున్నట్టు యువ హీరోయిన్ దుషార విజయన్ చెప్పారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, తనకంటూ ఓ స్టార్‌డమ్ సొంతం చేసుకున్న యువ హీరోయిన్ దుషార విజయన్. 'సర్పట్టా పరంబరై' మూవీలో మారియమ్మ పాత్రలో తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచి, ఎవరీ అమ్మాయి అని ఆశ్చర్యపోయేలా చేసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. దిండిగల్‌కు చెందిన ఈ ముద్దుగుమ్మ కెరీర్ ఆరంభంలోనే ధనుష్, రజనీకాంత్, విక్రమ్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించి ప్రస్తుతం టాప్ గేర్‌లో తన కెరీర్ కొనసాగిస్తోంది.. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. అవేంటో ఓ సారి చూద్దాం...

? 'వేట్టయన్' చిత్రంలో నటించడం ఎలాంటి ఫీలయ్యారు.

! 'రాయన్' సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడు కేఈ జ్ఞానవేల్ రాజా సంప్రదించారు. రజనీ, అమితాబ్ వంటి గొప్ప నటులు నటించే చిత్రం కావడంతో అది దేవుని ఆశీర్వాదంగా భావించాను. తొలి రోజే సూపర్‌స్టార్‌తో షాట్. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. 'సర్పట్టా పరంబరై'లో నా నటన బాగుందని ప్రశంసించారు.

? సూపర్‌స్టార్ వద్ద ఏం నేర్చుకున్నారు.

! ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంతో స్టార్‌డం ఉన్నప్పటికీ ఆయన సాధారణంగా ఉంటారు. ఒకే ఒక సూపర్‌స్టార్ రజనీకాంత్ మాత్రమే. ఆయనకు ప్రత్యామ్నాయం లేదు. తారస్థాయికి వెళ్ళిన మన కాళ్ళు భూమ్మీదే ఉంటాయనే విషయాన్ని ఆయన వద్ద నేర్చుకున్నాను.

? మీకు మంచి మంచి పాత్రలు, క్యారెక్టర్లు ఎలా వస్తున్నాయి.

! మంచి కథలనో లేదా మంచి పాత్రలను వెతుక్కుంటూ నేను వెళ్ళడం లేదు. సహజసిద్ధంగా కుదుతున్నాయి. ఎవరి దగ్గరా అవకాశాల కోసం అడుక్కోవడం లేదు. బలమైన పాత్రల్లో నటించాను. అమాయక పాత్రల్లో నటించాలన్నదే నా కోరిక.

? ధనుష్, రజనీ, విక్రమ్... ఈ ముగ్గురిని ఏ కోణంలో చూస్తారు.

! ఎంతో సంతోషంగా ఉంది. విక్రమ్‌తో 'వీర ధీర శూరన్'లో నటిస్తున్నాను. సెట్‌లో ఒకరకమైన వెర్రితనంతో నటిస్తారు. రజనీని ఓ ఉన్నత స్థానంలో ఉంచాను. ధనుష్ విషయంలో టైమ్, స్పీడ్ ముఖ్యం.

? ఇంతకీ పెళ్ళి ఎపుడు చేసుకుంటారు.

! నా ఇష్టాయిష్టాలను కుటుంబ సభ్యులు బాగా అర్థం చేసుకున్నారు. అందువల్ల పెళ్ళి ప్రస్తావన ఇప్పట్లో ఉండదు.

? సినిమాలో ఎదుర్కొన్న సవాళ్ళు ఏమైనా ఉన్నాయా.

! ఎవరెన్ని అనుకున్నా నాకేంటి అనే ధోరణి నాది. నా పని నేను చేసుకుంటున్నా. ఇక్కడ ప్రశాంతంగా ఉండటమే అతిపెద్ద ఛాలెంజ్. గెలుస్తాననే నమ్మకం ఎంతో ముఖ్యం. ఎమోషనల్‌లో ఉండేవారికి ఈ సినిమా సరిపోదు.

? అంటే ప్రతిభ ఒక్కటే సరిపోతుందా.

! నేను మోడలింగ్ నుంచి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టాను. ఇక్కడ డబ్బు ముఖ్యం కాదు. సినిమా వదిలివేసి ఇంటికెళ్ళినా మూడు పూటలా అన్నంపెట్టి నన్ను మహారాణిలాగా నా తల్లిదండ్రులు చూసుకుంటారు.

? మీ డ్రీమ్ రోల్

! ప్రియాంకా చోప్రా బయోగ్రఫీలో నటించాలన్న ఆశ ఉంది. ఆమె జీవితంలో జరిగిన అనేక విషయాలను తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది.

కమల్ చిత్రానికి జీవీ సంగీతం!

అగ్రనటుడు కమల్ హాసన్ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ తొలిసారి సంగీతం అందించనున్నారు. కోలీవుడ్‌లో రజనీకాంత్, విజయ్, అజిత్, సూర్య, విక్రమ్, ధనుష్, శింబు, శివ కార్తికేయన్ వంటి హీరోల చిత్రాలకు సంగీతం సమకూర్చారు. అయితే, ఇప్పటివరకు కమల్ ఒక్క చిత్రానికి కూడా సంగీతం సమకూర్చలేదు. ఈ క్రమంలో కమల్ నటించే 237వ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించే అవకాశం ఉన్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రానికి అన్బరివు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 2025లో సెట్స్‌పైకి తీసుకెళ్ళింది.



కమల్ హాసన్ - జీవీ ప్రకాష్



సినిమా రివ్యూలపై తొలి మూడు రోజులు నిషేధించాలి

● హైకోర్టులో పిటిషన్

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విడుదలయ్యే చిత్రాలకు తొలి మూడు రోజుల పాటు రివ్యూలు రాయకుండా నిషేధం విధించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. తమిళనాడు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ పిటిషన్ వేయగా, మంగళవారం విచారణకు వచ్చింది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల్లో కొత్త సినిమాల గురించి విడుదలైన తొలి మూడు రోజుల పాటు ఎలాంటి రివ్యూలు చేయకుండా ఆదేశించాలని అందులో కోరారు. కాగా, ఇటీవల హీరో సూర్య నటించిన 'కంగువా' చిత్రంపై తొలి ఆట ప్రదర్శన తర్వాత సినీ ప్రేక్షకులతో పాటు సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ ఆ చిత్రం వసూళ్ళపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో నిర్మాతతో పాటు బయ్యర్లు కూడా అపారనష్టాన్ని చవిచూశారు. దీంతో యూట్యూబర్లు రివ్యూలు రాయకుండా చూడాలన్న డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ తొలి మూడు రోజుల పాటు రివ్యూలపై నిషేధం విధించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించింది.

నిశిరాత్రిలో నీటి ఉధృతి

● సాత్తనూరు డ్యామ్ వద్ద 'చెంబరంబాక్కం ఘటన' పునరావృతం

● అర్ధరాత్రి 1.68 లక్షల ఘనపుటడుగుల నీరు విడుదల ● నాలుగు జిల్లాలకు వరద ముప్పు






జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండటంతో నిలిచిన వాహనాలు



చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో విల్లుపురం జిల్లా అరసూరులో రహదారిపై ప్రవహిస్తున్న తెన్‌పెన్నైయారు వరదనీరు - వరదనీటి ప్రవాహాన్ని చూస్తున్న గ్రామస్తులు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల తర్వాత చెంబరంబాక్కం జలాశయ సంఘటన గుర్తుకు తెచ్చేలా తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు జలాశయం నుంచి ఎటువంటి హెచ్చరికలు లేకుండా, అర్ధరాత్రి ఆకస్మికంగా సెకనుకు 1.68లక్షల ఘనపుటడులు చొప్పున నీరు విడుదల చేయడంతో నాలుగు జిల్లాలకు వరదముప్పు ఏర్పడింది. ఫెంగల్ తుఫాను ప్రభావిత వర్షాల కారణంగా తెన్‌పెన్నైయారు నీటిపరివాహ ప్రాంతాల్లో వరదలు సంభవించడంతో తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు డ్యామ్ ఇన్‌ఫ్లో ఒక్కసారి పెరిగింది. ఆదివారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో సెకనుకు 5వేల ఘనపుటడుగుల మేర సాత్తనూరు డ్యామ్‌లోకి నీరు రావడంతో అదే రోజు అర్ధరాత్రి 12.45 గంటలకు ఆకస్మికంగా లక్షఘనపుటడుగుల మేరకు ఇన్‌ఫ్లో పెరిగింది. రెండుగంటల్లో అంటే సోమవారం వేకువజాము 2.45 గంటలకు ఇన్‌ఫ్లో 1.68 లక్షల ఘనపుటడుగులకు పెరిగింది. ఆ డ్యామ్ నీటిమట్టం పూర్తి స్థాయికి (119 అడుగులకు) చేరింది. ఆ జలాశయ భద్రత దృష్ట్యా డ్యామ్‌లోకి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే తెన్‌పెన్నైయారులో విడిచిపెట్టారు. దీంతో తెన్‌పెన్నైయారు తీరానికి చేరువగా ఉన్న తిరువణ్ణామలై, కళ్ళకురిచ్చి జిల్లా తిరుక్కోవిలూరు, విల్లుపురం, కడలూరు జిల్లాల్లోకి వరదనీరు ప్రవేశించింది. ఇన్‌ఫ్లో తగ్గటంతో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు డ్యామ్ నుండి విడిచిపెట్టే నీటి పరిమాణం సెకనుకు 68 వేల ఘనపుటడుగులకు తగ్గించారు. ఆ నేపథ్యంలో సెకనుకు 30 వేల ఘనపుటడుగుల చొప్పున అదనపు జలాలను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించి, అర్ధరాత్రి 1.68 లక్షల ఘనటపుడగుల జలాలను ఒక్కసారిగా విడుదల చేయడంతో నాలుగు జిల్లాల ప్రజలు ఊహించని వరదలతో కష్టాలపాలయ్యారు. ఆదివారం రాత్రి నీటిపారుదల శాఖ వరద హెచ్చరిక జారీ చేసింది. అందులో సాత్తనూరు డ్యామ్ నుండి సెకనుకు 30 వేల ఘనపుటడుగుల జలాలు విడుదలవుతాయని ఏఈఈ రాజారామన్ పేర్కొన్నారు. అయితే ఆ తరువాత ఐదుగంటలు దాటగానే రాత్రి 12.45 గంటలకు సెకనుకు లక్ష ఘనపుటడుగులు జలాలను విడుదల చేశారు. సోమవారం వేకువజాము 2.45 గంటలకు 1.80లక్షల ఘనపుటడుగుల మేరకు జలాలను విడుదల చేయనున్నట్లు ప్రసార మాధ్యమాలకు సమాచారం ఇచ్చారు. అర్ధరాత్రి నీటిపారుదల శాఖ ఇచ్చిన ఈ సమాచారం నిద్రలో ఉన్న ప్రజలకు అందలేదు. అంతేకాకుండా వరద హెచ్చరిక చేసే గంట ముందే డ్యామ్ నుండి 1.68 లక్షల ఘనపుటడుగుల నీటిని విడుదల చేశారు. 4 జిల్లాల్లో తెన్‌పెన్నైయారు తీరాలలో నివసిస్తున్న ప్రజలు ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. తమ ఆస్తులను కాపాడేందుకు కూడా వీరికి సమయం లేకపోయింది. ఇళ్ళు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పొలాలు వరద నీటిలో మునిగాయి. పశువులు, కార్లు, ద్విచక్రవాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. తిరువణ్ణామలై - విల్లుపురం, తిరుక్కోవిలూరు- విల్లుపురం, విల్లుపురం - ఉలుందూరుపేట జాతీయ రహదారుల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. 2015 చెంబరంబాక్కం జలాశయం నుంచి ఎలాంటి ముందస్తు ప్రకటన చేయకుండా అర్ధరాత్రి అదనపు జలాలను విడుదల చేసి రాజధాని నగరం చెన్నైని వరదల్లో ముంచెత్తిన సంఘటనను తలపించేలా, ఆ సంఘటన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత అర్ధరాత్రి లక్ష ఘనపుటడుగుల కంటే అధికంగా జలాలను విడుదల చేయనున్నట్లు ముందుగా ఎలాంటి ప్రకటన చేయకుండా, ఆకస్మికంగా సెకనుకు 1.68లక్షల ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేశారు. కృష్ణగిరి డ్యామ్, వన్నియారు డ్యామ్, పాంబారు డ్యామ్ నుండి ఒకే సమయంలో అదనపు జలాలలను విడుదల చేయడంతో, సాత్తనూరు డ్యామ్‌లో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో ఆ డ్యామ్ భద్రత దృష్ట్యా ఆకస్మికంగా నీరు విడుదల చేయాల్సి వచ్చిందంటూ నీటిపారుదల శాఖ అధికారులు తమ తప్పిదాలను సమర్థించుకుంటున్నారు. ఇదిలా ఉండగా సాత్తనూరు డ్యామ్ జలాలను విడుదల చేయడం వల్ల తెన్‌పెన్నైయారులో ఏర్పడిన వరదల కారణంగా చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో వరదనీరు ప్రవహించింది. దీంతో చెన్నై నుంచితిరుచ్చి, మదురై, తంజావూరు సహా దక్షిణాది జిల్లాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.



తెన్‌పెన్నైయారులో ఉధృతంగా ప్రవహిస్తున్న, సాత్తనూరు డ్యామ్ నుండి విడుదలైన జలాలు

పుదుచ్చేరిలో 25 గ్రామాల మునక..

సాత్తనూరు డ్యామ్ నుంచి విడుదల చేసిన జలాల కారణంగా శంకరాభరణి, తెన్‌పెన్నైయారు వాగుల్లో వరద పరిస్థితి ఏర్పడి పుదుచ్చేరిలో 25 గ్రామాలు నీట మునిగాయి. చిత్తేరి డ్యామ్, కొంబ మదాన్‌మేడు చెక్‌డ్యామ్, మణ్‌మేడు డ్యామ్‌లో వరదనీరంతా ఉప్పెనలా పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ డ్యామ్‌ల నీటిపరివాహక గ్రామాలైన ఆరాయిచ్చికుప్పం, సోరియాంకుప్పం, కురువినత్తం, ఇరుళంసంద్రై, తిరుప్పనాంబాక్కం, కొంబ మందాన్‌మేడు తదితర గ్రామాల్లోని జనావాస ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది. ఇదే విధంగా చెట్టిపట్టు, వినాయకంపట్టు, మణ్‌వెలి, కాట్టేరికుప్పం, సంద్రైకుప్పు, వాదనూరు గ్రామాలు కూడా వరదముంపునకు గురయ్యాయి.



పుదుచ్చేరి ఆరాయిచ్చికుప్పంలోకి ప్రవేశించిన వరదనీరు

మూడు దశాబ్దాల తరువాత అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులతో నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంగేయనల్లూర్‌లోని కృపానంద వారియార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990వ సంవత్సరం చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. 34 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మోహన్ నేతృత్వం వహించగా, సెక్రటరీ శశికుమార్, కోశాధికారి వెంకటేశన్, జాయింట్ సెక్రటరీలు నెడుమారన్, వనిత, ఉప సెక్రటరీ దండపాణి, జి.సుందరరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు రూ.1.5 లక్షల విలువైన తాగునీరు శుద్ధీకరణ యంత్రాన్ని పాఠశాలకు అందజేయగా, మాజీ ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యన్ ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు మునిరత్నం, రామస్వామి, దొరైరాజ్, పట్టాభి, తిలకవతి, లక్ష్మీపతి, జయరామన్, పాఠశాల ఉపాధ్యాయుడు శివకుమార్, కాట్పాడి హోటళ్ల సంఘం అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే పూర్వ విద్యార్థులైన చెన్నై అసిస్టెంట్ పోలీసు కమిషనర్ మహేంద్రన్, సింగపూర్ ఐటీ ఉద్యోగి కార్తికేయన్, కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొనగా, సెక్రటరీ పురుషోత్తమన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

నగరంలో హై లైఫ్ బ్రైడ్స్ ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాసాలైలోని ఓ నక్షత్ర హోటల్‌లో హై లైఫ్ బ్రైడ్స్ ప్రదర్శన ప్రారంభమైంది. ఇందు లో వందకుపైగా అగ్రశ్రేణి బ్రైడల్ డిజైనర్లు, వ్యాపారులు తయారు చేసిన హై లైఫ్ బ్రైడ్స్, బ్రైడల్, డిజైనర్, ఎత్నిక్ వేర్, ఆభరణాలు, విలాసవంతమైన ఉపకరణాలు, లగ్జరీ లేబుల్స్ తదితరాలను ప్రదర్శనకు ఉంచారు. దేశంలోని ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, ముంబై, జైపూర్, ఇండోర్ సహా దుబాయ్‌కు చెందిన ఎమర్జింగ్ బ్రైడల్ డిజైనర్ల నుంచి వివిధ రకాలను సేకరించారు. ఫ్యాషన్ ప్రపంచంలో ఫ్యాషన్, జ్యూవెలరీ, బ్రైడల్, లగ్జరీ ఎగ్జిబిషన్‌ల ప్రపంచంలో హై లైఫ్ ఒక అగ్రగామిగా పేరుగడించింది. ఇది బీ2బీ కామర్స్ ప్లాట్‌ఫారం సహా ఐదు విభాగాల్లో పనిచేస్తుంది. ఇందులో 3 వేల మందితో డిజైనర్ల విభాగాన్ని కూడా ఏర్పాటుచేసింది.

దివ్యాంగులకు సహాయాలు

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురై మురుగన్ ముఖ్యఅతిథిగా హాజరై 25 మంది దివ్యాంగులకు రూ.28.50 లక్షల విలువైన మూడు చక్రాల వాహనాలు, 1.07 లక్షల విలువైన బ్యాటరీ చైర్ మొత్తం 49 మంది దివ్యాంగులకు సుమారు రూ.3 కోట్ల విలువైన సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు విజయన్, వేలూరు మేయర్ సుజాత, జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు, ఉప మేయర్ సునీల్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు సహాయాలు అందజేస్తున్న మంత్రి దురై మురుగన్



కార్తీక బ్రహ్మోత్సవాల వేడుకలు తిరుచానూరులో అంబరాన్నంటాయి. మంగళవారం ఉదయం అమ్మవారు కాళీయమర్ధనుడి అలంకారంలో సర్వభూపాల వాహనాన్ని అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 4.15 గంటలకు సర్వ తేజోమయమైన అమ్మవారు బంగారురథంపై శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి తిరుమాడవీధుల్లో విహరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. రాత్రి శ్రీవారికి ఇష్టమైన గరుడుడు అమ్మవారికి వాహనంగా మారారు. శ్రీమహావిష్ణువు రూపంలో గరుడవాహనంపై ఊరేగుతూ భక్తులను అమ్మవారు అనుగ్రహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాల ప్రదర్శనలు వాహనసేవల్లో భక్తులను అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

అలమేలుమంగ.. అభయమీయంగ!











శ్రీవారి పాదాల ఊరేగింపు

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. తిరుమల ఆలయం నుంచి స్వామివారి స్వర్ణపాదుకలను మంగళవారం ఉదయం 11 గంటలకు తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాలలు నడుమ శ్రీవారి పాదాలను తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి శ్రీవారి పట్టపురాణి పద్మావతి అమ్మవారు స్వామివారి పాదాలు ధరించి గరుడసేవలో తరించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: సూర్యప్రభ వాహనం

మధ్యాహ్నం 12 గంటలకు: స్నపన తిరుమంజనం

రాత్రి 7 గంటలకు: చంద్రప్రభ వాహనం



దివ్య నేత్రుల కోసం

వాకింగ్ స్టిక్.. కళ్ళజోడు

రూపొందించిన కోవై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు





స్మార్ట్ వాకింగ్ స్టిక్, కళ్ళజోడు రూపొందించిన విద్యార్థులు

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెన్సార్ టెక్నాలజీని అందిపుచ్చుకున్న కోవై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ మేథోశక్తితో స్మార్ట్ వాకింగ్ స్టిక్, కళ్ళజోడు రూపొందించి పలువురి నుంచి ప్రసంశలందుకున్నారు. కోయంబత్తూరు అరసూర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐసక్, జబ కుమార్, మరుదీశ్, వీరమణి ఆ పాఠశాల ప్రయోగశాలలో సెన్సార్ టెక్నాలజీతో తయారుచేసిన వాకింగ్ స్టిక్, కళ్ళజోడు అంధులకు ముందుగానే ప్రమాద హెచ్చరికలు తెలియజేస్తాయి. మైక్రోకంట్రోలర్, సెన్సార్లను పొందు పరిచిన కళ్ళజోడు, వాకింగ్ స్టిక్ బ్యాటరీ ద్వారా పనిచేస్తాయి. వీటితో రోడ్డుపై నడిచి వెళ్లే అంధులకు ముందున్న అడ్డంకుల గురించి సౌండ్ ద్వారా హెచ్చరించేలా డిజైన్ చేశారు. పాఠశాల విద్యార్థి దశలోనే అంధుల సంక్షేమం కోసం శ్రమించిన విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు, సహవిద్యార్థులు అభినందించారు.

ద్రవిడన్ అంటే దొంగ.. సంఘీ అంటే స్నేహితుడు

● సంచలన వ్యాఖ్యలు చేసిన సీమాన్

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గౌరవ ప్రదమైన మరణం అంటే కల్తీ మద్యం తాగి మరణించడమేనా..? ద్రవిడన్ అంటే దొంగ.. సంఘీ అంటే స్నేహితుడంటున్నారని నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ వ్యాఖ్యానించారు. స్థానిక విమానాశ్రయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేస్తున్న ఆదాయ పన్ను శాఖ అధికారులు ముఖ్యమంత్రి స్టాలిన్ గురించి పట్టించుకోవట్లేదన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.2లక్షలు, ప్రకృతి వైపరీత్యాల వంటి ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్న స్టాలిన్ ప్రభుత్వం కల్తీ మద్యం తాగి మరణించిన వారి కుటుంబాలకు మాత్రం రూ.10లక్షలు నష్టపరిహారంగా చెల్లించడం విడ్డూరంగా ఉందన్నారు.

పోక్సో కేసులో యువకుడికి 27ఏళ్ల జైలుశిక్ష

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి దిండుగల్ న్యాయస్థానం 27ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. 2023లో నత్తంలో ఓ గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిని (20) నత్తం పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి జైలుకు తరలించారు. దిండుగల్ ప్రిన్సిపల్ మహిళా న్యాయస్థానంలో ఏడాదికి పైగా సాగిన ఈ కేసు విచారణ పూర్తి కావడంతో బుధవారం న్యాయమూర్తి నిందితుడికి 27ఏళ్ల జైలు శిక్ష, 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాజీ ఐఏఎస్ అధికారి మృతికి సీఎం స్టాలిన్ సంతాపం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి ఏఎం రామన్ మృతి చెందగా, భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపం, సానుభూతి తెలిపారు. సీఎం వెంట ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం, ప్రభుత్వ ఉన్నతాధికారులున్నారు. ఏఎం రామన్ మృతిపై సీఎం స్టాలిన్ ఓ ప్రకటన విడుదల చేశారు. తన తండ్రి దివంగత కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1996-99 మధ్యకాలంలో ఆయన కార్యదర్శిగా రామన్ పనిచేశారని, ఆయనను కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు.

బ్యాంక్ ఖాతాల్లో పొంగల్ నగదు

● సూచించిన మదురై హైకోర్టు బెంచ్

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయవచ్చని హైకోర్టు మదురై బెంచ్ సూచించింది. తంజావూరు జిల్లా కుంభకోణంకు చెందిన విమనాథన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు అందించే పొంగల్ సరుకుల గిఫ్ట్ ప్యాక్‌లో చక్కెరకు బదులుగా కిలో బెల్లం ఇవ్వాలని, పొంగల్ బహుమతిగా ఇస్తున్న రూ.1,000 నగదు కార్డుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని హైకోర్టు మదురై బెంచ్‌లో గత ఏడాది పిటిషన్ వేశారు. ఈ కేసు విచారించిన హైకోర్టు, బ్యాంక్ ఖాతాలో నగదు జమ అంశాన్ని వచ్చే ఏడాది పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే ఏడాది పొంగల్‌కు ఇంకా ఒకటిన్నర నెల వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటి వరకు పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేసే విషయమై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందువల్ల, 2025 పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లో చక్కెరకు బదులుగా బెల్లం ఇవ్వడం, నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలి, గిఫ్ట్ ప్యాక్‌లో అందించే చెరకు, టెంకాయ తదితరాలు రాష్ట్ర రైతుల నుంచే కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని తాజాగా పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తులు ఎంఎస్ సురేష్, ఏటీ మరియక్లాట్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. పొంగల్ నగదు బహుమతి బ్యాంక్ ఖాతాల్లో జమచేయవచ్చు కదా? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. రూ.1,000 నగదు బ్యాంక్ ఖాతాల్లో జమచేసే సమయంలో, ఖాతాలో కనీస బ్యాలెన్స్ లేదంటూ, జమచేసే నగదు తీసుకుంటున్నారని అందుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అంతలో పిటిషనర్ తరఫు న్యాయవాది మహిళ ప్రోత్సాహన నిధులు బ్యాంక్ ద్వారా అందిస్తున్న నేపథ్యంలో, పొంగల్ నగదు కూడా బ్యాంక్ ఖాతాల్లో చెల్లించాలంటూ తెలిపారు. ఇరుతరఫు వాదనల అనంతరం ధర్మాసనం, హైకోర్టు ఇదివరకే సూచించిన విధంగా పొంగల్ నగదు బహుమతి రేషన్ కార్డుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయడంపై వినియోగదారుల వాణిజ్య సమాఖ్య అదనపు కార్యదర్శి అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదావేశారు.



ఆంధ్ర డ్యాం నుంచి కుశస్థలిలోకి నీటి విడుదల

తిరుత్తణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రంలోని కృష్ణాపురం అమ్మపల్లి డ్యాం నుంచి సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు వెయ్యి ఘనపుటడుగుల నీటిని కుశస్థలి నదిలోకి విడుదల చేశారు. అమ్మపల్లి డ్యాం నుంచి విడుదల చేసిన నీరు సానకుప్పం, కీకలపట్టడై, నెడియం, సమంతవాడ మీదుగా రాష్ట్ర సరిహద్దుల్లోని పళ్లిపట్టు సమీపం కుశస్థలి నదిలో కలుస్తుంది. దీంతో నదీ పరివాహక ప్రజలకు వరద హెచ్చరిక చేశారు. కీకలపట్టడై, నెడియం, సమంతవాడలోని నేలవంతెనలు నీటిమునిగాయి. దీంతో వాహనాల రాకపోకలను ఆపేసిన అధికారులు, పోలీసులు ఆ ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు.



వంతెనపై వరద ఉధృతి పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

భవనం నుంచి జారిపడి ఇద్దరి మృతి

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్ తాంబరం సమీపం సేలయూర్‌లో అపార్టుమెంట్ నిర్మాణ పనుల్లో మూడో అంతస్తు నుంచి జారి పడి ఒడిశాకు చెందిన ఇద్దరు కార్మికులు మృతి చెందారు. కొత్తగా నిర్మిస్తున్న అపార్టుమెంట్‌లో 15 మందికి పైగా ఉత్తరాది కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం మూడో అంతస్తులో సెంట్రింగ్ పనిచేస్తున్న కనకరాజ్(47), సురు (27), అనే కార్మికులు హఠాత్తుగా కిందికి జారి పడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో తోటి కార్మికులు క్రోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక వారు మంగళవారం మృతిచెందారు. సేలయూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఖాళీ మద్యం బాటిళ్ల ద్వారా రూ.45 కోట్ల ఆదాయం

ఐసిఎఫ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం బాటిళ్లు తిరిగి తీసుకొనే ప్రాజెక్ట్ ద్వారా రూ.45 కోట్ల ఆదాయం లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. 2025 ఏప్రిల్ నెలాఖరులోగా అన్ని టాస్మాక్ దుకాణాల్లో ఖాళీ మద్యం బాటిళ్లు తిరిగి తీసుకొనే చర్యలు చేపడతామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అందుకు హైకోర్టు, ఖాళీ మద్యం సీసాలు తీసుకోవడం సిబ్బందిపై అదనపు భారం పడుతుందా? అంటూ ప్రశ్నించిన హైకోర్టు, టాస్మాక్ సిబ్బందికి ఏర్పడే అదనపు పని భారంపై అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది.

ఆర్ అండ్ బీ అధికారి ఇంటిలో దోపిడీ

ఐసిఎఫ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కారపాక్కంలోని ప్రభుత్వ అధికారి నివాసంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగలు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. కారపాక్కం పుదుచ్చేరి గోకులం కాలనీలో ఓ ఇంటిలో ఆర్ అండ్ బీ అధికారి సెల్వరాజ్ కుటుంబంతో ఉంటున్నారు. సెల్వరాజ్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్య సహా బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండటంతో దిగ్భ్రాంతి చెందారు. ఇంటిలోపలకు వెళ్ళి చూడగా బీరువాలోని బంగారు, వెండినగలు, రూ.3500ల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దోపిడీ దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కుశస్థలి నదిలో వృద్ధుడి మృతదేహం

తిరుత్తణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుశస్థలి నదిలో వృద్ధుడి మృతదేహం కొట్టుకొచ్చింది. తిరువళ్లూర్ జిల్లా కనకమ్మసత్రం సమీపంలోని కుప్పట్టుపాళయం గ్రామానికి చెందిన లక్ష్మయ్య (65) సోమవారం ఎన్నాపేట ప్రాంతంలో నదిని దాటేందుకు యత్నించగా, వరద ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అతడి కోసం కనకమ్మసత్రం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలించారు. కొద్ది దూరంలో లక్ష్మయ్య మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

భారీవర్షాల సమయంలో 1,526 ప్రసవాలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్, భారీవర్షాల సమయంలో చెన్నై, చుట్టుపక్కల జిల్లాల్లో 1,526 ప్రసవాలు జరిగాయి. ఈ విషయమై ఆరోగ్య శాఖ కార్యదర్శి సుప్రియసాహు విడుదల చేసిన ప్రకటనలో... తుఫాను, భారీవర్షాలకు ముందే నిండు గర్భిణుల వివరాలను ఆరోగ్యశాఖ చేపట్టిందన్నారు. గత నెల 30వ తేది తుఫానుకు ముందే గర్భిణులను ఆస్పత్రులకు తరలించామని, వైద్యులు, నర్సులు, సిబ్బంది కలసి 1,526మందికి సుఖ ప్రసవాలు చేశారని తెలిపారు.

● ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్...

పెరిగిన ఎండుచేపల ధరలు

టి.నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పాంబన్ ప్రాంతంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా ఎండుచేపల ధర లు విపరీతంగా పెరిగాయి. పాంబన్ ప్రాంతంలో జాలర్లు రోజూ మరపడవలపై సముద్రంలో చేపలవేటకువెళ్ళి సీలా, తిరుక్కై, కారల్, మాసి రకాలకు చెందిన చేపలను పట్టి తిరిగివస్తారు. ఆ చేపలను సముద్రతీరంలో ఎండబెట్టి రాష్ట్రం నలమూలలా సరఫరా చేస్తుంటారు. వారం రోజులకు పైగా పాంబన్ ప్రాంతంలో వర్షాల కారణంగా జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు.. దీంతో అక స్మాత్తుగా ఎండు చేపలకు గిరాకీ పెరిగింది. కేజీ ఎండు చేపల ధరలు రూ.50ల నుంచి రూ.200లకు పైగా పెరిగాయి. కేజీ సీలా రూ.300ల ధరకు విక్రయిస్తున్నారు.

జలాశయాల్లో 173 టీఎంసీల నిల్వలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జలాశయాల్లో 173 టీఎంసీల నీటినిల్వలున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ పరిధిలో 90 జలాశయాలుండగా, వాటి పూర్తి సామర్థ్యం 224 టీఎంసీలు. ఈ జలాశయాల్లో మేట్టూరు, భవానీసాగర్, ముల్లైపెరియార్, పరంబికుళం సహా 15 జలాశయాల సామర్థ్యం 198 టీఎంసీలు. మిగిలిన వాటిలో టీఎంసీ కంటే తక్కువగా ఉన్నాయి. ఈశాన్య రుతుపవన వర్షాలతో జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. ప్రస్తుతం 90 జలాశయాల్లో 173 టీఎంసీల నీరుంది. అధికంగా సేలం-మేట్టూరు జలాశయంలో 79.7 టీఎంసీలు, ఈరోడ్-భవానీసాగర్‌లో 26.9, కోవై-పరంబికులంలో 12.7, తిరువణ్ణామలై-సాతనూర్ జలాశయంలో 7.09 టీఎంసీల నీరుదని అధికారులు తెలిపారు.

సౌందర్య సాధనాలపై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూలికా సౌందర్య సాధనాలు, చర్మ సంరక్షణ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈకాట్టుతాంగల్‌లోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంట ల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. కొబ్బరి నూనె సబ్బు, మూలికా సబ్బు, హెయిర్ గ్రోత్ ఆయిల్, హెయిర్ గ్రోత్ షాంపూ, ఫేస్ వాష్ జెల్, హ్యాండ్‌వాష్ లిక్విడ్ తదితరాలతో పాటు స్వయం ఉపాధి వ్యాపారం ప్రారంభించేందుకు సలహాలు ఇవ్వనున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణా కాలంలో తక్కువ అద్దెకు మహిళలు, పురుషులకు వేర్వేరుగా బస అందించనున్నారు. మరిన్ని వివరాలకు 8668102600, 7010143022 నెంబర్లలో సంప్రదించవచ్చు.

నీటి కొలనులో పడి యువకుడి మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయనవరం తాత్తాంకుప్పం ప్రాంతంలోని కొలనులో జారిపడి ప్రశాంత్ (27) అనే వాయిద్యకారుడు మృతి చెందాడు. అయనవరం గార్డెన్ వీధిలో నివసిస్తున్న ప్రశాంత్ తాత్తాంకుప్పంలో ఓ అశుభ కార్యానికి స్నేహితులతో కలిసి వెళ్ళాడు. సాయంత్రం అక్కడి పెరుమాళ్ ఆలయ కొలనులో స్నానం చేయడానికి దిగి జారిపడి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.